ప్రజాశక్తి
ఆదివారం 30 ఏప్రిల్ 2023
5
అల్లూరి సీతారామరాజు

అరకులోయలో బైక్ దగ్ధం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్ : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి బిస్మిల్లా చికెన్ సెంటర్ ఎదురుగా శనివారం పల్సర్ 220 బైక్ నుంచి మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. బైక్ రన్నింగ్‌లో ఉండగానే ఇంజిన్ నుంచి పొగలు వ్యాపించాయి. దీంతో పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి దిగి పోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

దగ్ధమవుతున్న బైక్

వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని

గిరిజన సంఘం భారీ ర్యాలీ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:గిరిజనలు పండిస్తున్న సేంద్రీయ వాణిజ్య పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని మండల కేంద్రంలోని సంతలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో శనివారం భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనసంఘం మండల కార్యదర్శి ఎం.ఎం.శ్రీను మాట్లాడుతూ, 'కిలో చింత పండుకు రూ. 100 మద్దతు ధర ప్రకటించాలని, జీడి పిక్కలను కిలో రూ. 150లకు కొనుగోలు చేయాలన్నారు. సేంద్రియ వాణిజ్య పంటలకు మద్దతు ధరలు కల్పించాలన్నారు. అల్లూరి జిల్లా ఏర్పడినప్పటి నుండి జిల్లా వ్యాప్తంగా ఆదివాసీలు పండించే వాణిజ్యపర మైన పంటలైన చింతపండు, జిడి మామిడి పిక్కలు, పసుపు, కాఫీ, మిరియాలు వంటి సేంద్రీయ పంటలకు గిట్టుబాటు ధరలు లేక గిరిజనులు అత్యధికంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించక పోవడంతో దళారుల చేతిలో గిరిజనులు మోసపోతున్నారన్నారు. దళారీ వ్యవస్థపై నిఘా పెట్టి గిరిజనులు పండిస్తున్న పంటలను జిసిసి సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో జిసిసి సొసైటీ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతంలో పండిస్తున్న చిరుధాన్యాలతో పాటు వాణిజ్య పంటలను కొనుగోలు చేసి గిరిజనులకు గిట్టుబాటు ధరలు

సంతలో ర్యాలీ చేపడుతున్న గిరిజన సంఘం నాయకులు

కల్పించేవారన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు, కొర్ర డోంబ్రు, లైకోన్, బిమారాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కుటుంబ సభ్యులు, నాయకులు

ఏరియా ఆసుపత్రిలో శిశువు మృతి

కెజిహెచ్‌కు తరలించేందుకు అందుబాటులో లేని అంబులెన్స్

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో శిశువు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. మండలంలోని బస్కి పంచాయితీ గొందన గ్రామానికి చెందిన జి.సంగీత (పివిటిజి) గర్భిణీ. పురిటి నొప్పులతో బాధ పడటంతో అరకు ఏరియా ఆసుపత్రికి గురువారం రాత్రి 9 గంటల సమయంలో తీసుకొచ్చారు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో మగ బిడ్డ .జన్మించాడు. తల్లి నీరసంగా ఉంటడంతో శిశువుకు కూడా ఆరోగ్యం సరిగా లేదు. ముందే విశాఖ కేజిహెచ్‌కు రిపర్ చేయాలని కుటుంబీకులు తెలిపారు. అంబులెన్స్ అందుబాటులోకి లేకపోవడంతో తరలించక పోవడంతో శిశువు మృతి చెందాడు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా బిడ్డ చనిపోయిందని సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు తెలిపారు. పేరుకే ఏరియా ఆసుపత్రి అని సౌకర్యాలు ఉన్నప్పటి వైద్య సిబ్బంది లేక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కేజీహెచ్‌కు తీసుకెళ్లడానికి కనీసం అంబులెన్స్ లేకపోవడం దారుణమన్నారు. సంగీత కి ఆరు నెలలపాటు పౌష్టికాహారం ఉచితంగా అందించాలని, డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కొర్ర మాణిక్యం, బాబురావు కుటుంబీకులు ఉన్నారు.

అవగాహన కల్పిస్తున్న మేనేజర్

ఎస్‌బిఐ సేవలపై అవగాహన

ప్రజాశక్తి-అనంతగిరి: ఎస్‌బిఐ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ శ్రీ హర్ష తెలిపారు. మండలంలోని పెదవిడ్డ పంచాయతీ మేడపర్తి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. ముఖ్యంగా డ్వాక్రా మహిళలు పొదుపు, అప్పు ఖాతాలు సక్రమంగా నిర్వహించినట్లయితే వారికి సుమారు 20 లక్షల వరకు ఇచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఎంపీ ఎస్టి మేనేజర్ రఘురాం మాట్లాడుతూ,బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీసీ పాయింట్ నిర్వాహకులు సంజీవరావు, సిబ్బంది, యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

అడవి వెంకన్న గూడెంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులు

నిర్వాసితులకు న్యాయం జరిగేలా సర్వే చేయాలి

- ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం కోసం తమ సర్వం కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం జరిగేలా సర్వే చేయాలని ఎంపిపి కారం లక్ష్మి అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని రామవరం పంచాయతీ పరిధి అడవి వెంకన్నగూడెం, రామవరం గ్రామాలలో జరుగుతున్న పునరవాస ఇళ్ల సర్వేను శనివారం ఎంపిపి లక్ష్మి, సిపిఎం నాయకులు పరిశీలించారు. సర్వే చేసే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ కొన్ని గ్రామాలలో సర్వే చేసే విధానం అసలు బాగాలేదని, ఈ విషయాన్ని సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లినా సర్వే తీరు మారలేదని పేర్కొన్నారు. ఓపికతో ప్రతి విషయాన్ని అడిగి తెలుసుకుని నిర్వాసితుడికి పూర్తి న్యాయం చేయాలని సూచించారు. ఎన్నో సంవత్సరాలుగా జీవిస్తున్న తమ సొంత గ్రామాన్ని, వ్యవసాయాన్ని, అన్నింటిని రాష్ట్రం కోసం వదులుకొని వెళ్తున్న విషయాన్ని అధికారులు గమనించాలని, నిర్వాసితుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉండకూడదని కోరారు. ఇంటి కొలతలు తీసేటప్పుడు పొడవు వెడల్పులు మాత్రమే చూస్తున్నారని, ఇంటి చుట్టూ నిర్మించిన ప్రహరీ, ఆరుబయట చేసిన సిమెంట్ వాకిలిని, ఇంటి గోడల నాణ్యతను పరిగణనలోకి తీసుకొని సర్వే చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఏడాదికి మూడునాలుగు సార్లు వచ్చిన వరదలకు పూర్తిగా కొట్టుకుపోయిన ఇళ్లకు కూడా సర్వే చేసి వారికి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు కుంజ నాగిరెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

గృహాలను త్వరితగతిన నిర్మించాలి

-డిఇఇ మోహన్‌రావు- పలుచోట్ల నిర్మాణ పనుల పరిశీలన

లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిఇఇ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: 2021, 2022 లో గ్రామీణ గృహ నిర్మాణ పథకం ద్వారా మంజూరైన గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు అరకు సబ్ డివిజన్ డిఈ కే మోహన్‌రావు చెప్పారు. మండలంలో శనివారం ఆయన సందర్శించి గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అరకు సబ్ డివిజన్ పరిధిలోని అనంతగిరి, అరకువేలి, డుంబ్రిగూడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో 4206 గృహాలు మంజూరు కాగా 3,749 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. మిగిలిన 457 గృహాలు ఇప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభించక పోవడంతో వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిర్మాణాలు పూర్తిచేసిన 10 రోజులు లోపు లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సిహెచ్ కృష్ణారావు, వర్క్ ఇన్స్పెక్టర్లు ఈశ్వరి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హుకుంపేట:గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని అరకు డివిజన్ డిఇ మోహన్‌రావు అన్నారు. శనివారం ఆయా పంచాయతీల్లో నిర్మాణ పనులు పరిశీలించారు. నిర్మాణం చేసిన లబ్ధిదారులకు నేరుగా అకౌంట్లోనే డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. మండల కేంద్రంలోని 568 మంది లబ్ధిదారులకు పేమెంట్లు అందజేయడం జరిగిందన్నారు. మిగిలిన 14 మంది లబ్ధిదారులు కూడా పనులు త్వరగా చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వర్క్ ఇన్స్పెక్టర్ గౌరీ శంకర్ పాల్గొన్నారు.

లే అవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు



కార్యక్రమంలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

గిరిజనుల భూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు

- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజనుల భూ సమస్యల పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. శనివారం స్థానిక తన ఛాంబర్‌లో గిరిజనులకు సంబంధించిన భూ సమస్యలపై న్యాయవాదులతో ప్రాజెక్ట్ అధికారి కోర్టు నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ భూ సమస్యలు ఆయా గ్రామాల్లో దర్యాప్తు చేసి వారి అర్హతను బట్టి గిరిజనులకు న్యాయం చేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టాలు ఉండి వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు న్యాయం చేస్తామన్నారు.

కార్పొరేట్ కంపెనీలకు ఎమ్మెల్యే వత్తాసు

- హైడ్రో పవర్ ప్రాజెక్టులపై గిరిజనులను తప్పుదోవపట్టిస్తున్న వైనం

- సిపిఎం నేత చిన్నయ్య పడాల్ ధ్వజం

ప్రజాశక్తి పాడేరు: కార్పొరేట్ కంపెనీలకు పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి వత్తాసు పలుకుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. చింతపల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తూ ఈ ప్రాంత ఆదివాసి ప్రజలు, గిరిజన సంఘాలు చేస్తున్న ఉద్యమాన్ని పక్కదోవ పట్టించి ప్రజల్ని మభ్య పెట్టేందుకు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కుటీల ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఎర్రవరంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుతో కేవలం రెండు గ్రామాలు మాత్రమే ముంపునకు గురవుతాయని ప్రజల్ని నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టు వస్తేనే గిరిజనులకు ఉపాధి అవకాశాలు వస్తాయని యువతను తప్పు దోవ పట్టించాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ ప్రాంత ఆదివాసీలంతా ఐక్యంగా వ్యతిరేకిస్తున్న హైడ్రో ప్రాజెక్టు అనుమతుల రద్దు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రయత్నించకుండా ప్రజల్ని మభ్య పెట్టాలనుకోవడం సరికాదన్నారు. గిరిజన హక్కులు, చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తుంటే చూస్తూ జగన్ కీలుబొమ్మలా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మారిపోయారని దుయ్య బట్టారు. గిరిజన ప్రజాప్రతినిధిగా మన్యాన్ని, గిరిజనుల మనుగడను పరిరక్షించడం కోసం ఆదివాసీల తరపున ప్రభుత్వంతో పోరాడాలని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి హితవు చెప్పారు. ఆదివాసీలకు మేలు చేసే జీవో నెంబర్ 3 రిజర్వేషన్ను ప్రభుత్వం రద్దు చేస్తే గిరిజన ఎమ్మెల్యేలు చోద్యం చూస్తున్నారన్నారు. కనీసం గిరిజన సలహా మండలిలో జీవో 35 చర్చించే తీరిక లేకుండా పోయిందని గిరిజన ఎమ్మెల్యేల తీరును ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, సభ్యులు సాగిన చిరంజీవి పాల్గొన్నారు.

కిట్లను పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

రెడ్ క్రాస్ సేవలు విస్తృతం

- అసిస్టెంట్ కలెక్టర్ ఆశితోష్ శ్రీవాస్తవ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: రెడ్ క్రాస్ సేవలు విస్తతం చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ ఆశితోష్ శ్రీవాస్తవ అన్నారు. అల్లూరి జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఉప అధ్యక్షులు ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ ఆదేశాల మేరకు శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలికల వసతి గృహంలో సుమారు 25 మంది విద్యార్థినులకు ఐజనిక్ కిట్లను ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్ ఆశితోష్ శ్రీ వాస్తవ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు పౌష్టికమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అంతకముందు జిల్లా రెడ్ క్రాస్ బ్రాంచ్‌ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రెడ్ క్రాస్ కార్యాలయం చుట్టు పక్కన ఉన్న పిచ్చి మొక్కలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో తొలగించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ అప్పారావు, సభ్యులు లోహితస్, సూర్యారావు, జి గౌరీ శంకర్రావు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అందని వైద్యం..

- ఏరియా ఆసుపత్రిలో కనీస పరికరాలు, మందులు లేని వైనం
- నిధులు ఇవ్వని ప్రభుత్వం - ప్రైవేటుగా కొనుగోలు చేసుకుంటున్న బాధితులు

ప్రైవేటు మందుల షాపులో కొనుగోలు చేసిన క్లాత్ బ్యాండేజీలు, వివిధ రకాల మందులు

ప్రజాశక్తి-రంపచోడవరం

గిరిజనులంటే ఈ ప్రభుత్వానికి ఎంతటి చిన్నచూపో రంపచోడవరం ఏరియా ఆసుపత్రిని చూస్తే తెలుస్తుంది. దెబ్బ తగిలితే కట్టు కట్టడానికి క్లాత్ బ్యాండేజ్ కూడా లేదంటే ఈ ఆసుపత్రిలో వైద్యంపై ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ గిరిజనులకు వైద్యం అందని ద్రాక్షగానే ఉంది. రంపచోడవరం ఏజెన్సీలోని 7 మండలాల గిరిజనులకు ఈ ఏరియా ఆసుపత్రే పెద్ద దిక్కు. వెయ్యి పడకల గల ఈ ఆసుపత్రికి రోజూ వందలాది మంది వైద్యం నిమిత్తం వస్తున్నారు. కాని ఈ ఆసుపత్రిలో కనీసం ఉండాల్సిన పరికారాలు, మందులు లేకపోవడంతో గిరిజనులకు వైద్యం అందడం లేదు. ప్రమాదాల్లో గాయపడిన వారికి ఎముకుల సంబంధిత వైద్యం అందక ఇబ్బంది పడాల్సి వస్తోంది. శనివారం ఆసుపత్రిలో చోటుచేసుకున్న సంఘటనే ఇందుకు నిదర్శనం.

రోడ్డు ప్రమాదంలో చెయ్యి విరిగిన గిరిజనుడు శనివారం ఏరియా ఆసుపత్రికి వైద్యం నిమిత్తం వచ్చాడు. ఆయనకు సిమెంట్ కట్టు వేయడానికి కనీసం ఉండాల్సిన మెటీరియల్ కూడా ఆసుపత్రిలో లేదు. మందుల్లేవు. చివరికి కట్టుకట్టడానికి కావాల్సిన క్లాత్ బ్యాండేజ్ కూడా లేదు. మెటీరియల్ బయట నుండి తెచ్చుకుంటే కట్టుకడతామని వైద్యుడు చెప్పడంతో చేసేది లేక ప్రైవేటు మందుల దుకాణంలో బాధితుని బంధువులు కొనుగోలు చేసి తెచ్చారు. విరిగిన చెయ్యికి ఆపరేషన్ కోసం అవసరమైన ప్లేట్‌ను రాజమండ్రి వెళ్లి కొనుగోలు చేసి తెచ్చుకోవాలని వైద్యులు సూచించారు. దానికి మరో రూ.2,200 ఖర్చు చేయాల్సి వస్తుంది.

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గిరిజనులకు పూర్తి స్థాయిలో వైద్యం ఉచితంగా అందించాల్సి ఉందికదా అని బాధితుని బంధువులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌ను కల్పనను అడగ్గా తమ ఆసుపత్రిలో పరికరాలు లేవని, అందుకు కావాల్సిన నిధులు ప్రభుత్వం నుంచి రావడం లేదని బదులిచ్చారు. ఒక్క ఎముకుల వైద్యమే కాదు, ఏ రకమైన వైద్యం నిమిత్తం ఆసుపత్రికి వెళ్లినా అన్నీ ప్రైవేటుగా కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని గిరిజనులు వాపోతున్నారు. ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయించుకుంటే ఆ సొమ్ము కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఏరియా ఆసుపత్రిలో వైద్యానికి కావాల్సిన పరికరాలు, మందులు, అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

ప్రభుత్వం అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేయాలి

ఈ ఆసుపత్రి మా కోసం ఉందని అనుకుంటున్నాం. కాని ఇక్కడ ఎముకలకు సంబంధించిన పరికరాలు ఏమీ లేవు. దీని వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అని సౌకర్యాలు కల్పించాలి.

- బాపిరాజు, గిరిజనుడు

పరికరాలు ఉంటే మెరుగైన వైద్యం

ఆసుపత్రిలో వైద్యం చేయడానికి కావాల్సిన పరికరాలు ఏర్పాటు చేస్తే మెరుగైన వైద్య సేవలు అందిస్తాం. నేను ఈ ఆసుపత్రికి వచ్చి తొమ్మిది నెలలు అయింది. అప్పటి నుండి ఎముకలకు సంబంధించిన వైద్యం కోసం కావాల్సినవి బాధితులు బయట కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. నాకు మూడు నెలలుగా జీతం ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాను.

- డాక్టర్ సుధాకర్, ఎముకల వైద్య నిపుణులు.

ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు

ఆసుపత్రిలో మందులు, ఆపరేషన్ చేయడానికి ఎటువంటి పరికరాలు లేవు. ఇందుకు అవసరమైన నిధులు ప్రభుత్వ నుండి రావడం లేదు. దీని వల్ల తాము సరైన వైద్యం అందించలేకపోతున్నాం. ఎముకుల వైద్యానికి కావాల్సిన పరికరాలు లేకపోవడం వల్లే బయట నుండి కొనుగోలు చేసి తేవాలని గిరిజనులకు చెప్పాం.

- డాక్టర్ కల్పన, ఆసుపత్రి సూపరింటెండెంట్

బోర్డుపై తమ రూమ్ నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

నవోదయ పరీక్షకు సగం మంది హాజరు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పరీక్షకు 126 మంది విద్యార్థులు గైరాజరైనట్లు స్థానిక ఎంఈఓ కె.తాతబ్బాయిదొర తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు ఏలేశ్వరం, గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం తదితర మండలాల నుండి 252 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 126 మంది విద్యార్థులు మాత్రమే హాజరై పరీక్ష రాసినట్లు ఎంఈఓ వెల్లడించారు. నవోదయ పరీక్షకు సీఎస్‌గా పి శ్రీనివాసరావు వ్యవహరించారు.

తెల్లదోమ నివారణపై అవగాహన

ప్రజాశక్తి - రంపచోడవరం

ఉద్యానవన పంటల్లో తెల్లదోమ నివారణపై సంబంధిత రైతులకు రంపచోడవరం ఉద్యానవనశాఖ అధికారి ఎన్.రమేష్ అద్వర్యంలో శనివారం ఆర్‌బికె సిబ్బంది, రైతులకు అవగాహన కల్పించారు. పందిరి మామిడిలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసింది. తెల్లదోమ వల్ల కొబ్బరి, ఆయిల్‌పామ్, జామ, సపోటా తదితర పంటలకు ఎక్కువగా వ్యాపిస్తుందని, దీని వల్ల దిగుబడి తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త డాక్టర్ ఆదర్శ, లలిత కామేశ్వరి సర్పిలాకార దోమల ఎలా నివారించాలో తెలియజేశారు.

మాట్లాడుతున్న రమేష్

సెలవులతో ఇళ్లకు బయలుదేరిన విద్యార్థులు

సెలవులతో విద్యార్థులు ఇంటిబాట

ప్రజాశక్తి-పాడేరు టౌన్: వేసవి సెలవులు వచ్చాయంటే చిన్నారులకు పండగే..పండగ. పాఠశాలలకు ఈనెల 30 నుంచి వేసవి సెలవులు ప్రారంభం కావడంతో శనివారం వసతి గృహ విద్యార్థులు ఇళ్ల బాట పడుతున్నారు. వీరికి సహాయంగా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వసతి గృహాలకు చేరుకుని సామాగ్రితో సహ తీసుకెళ్లారు. పాడేరు పట్టణంలో ఎటు చూసినా తమ పిల్లలను ఇళ్లకు తీసుకు వెళుతున్న తల్లిదండ్రుల దృశ్యాలే దర్శనమిచ్చాయి. దీంతో పట్టణంలోని రోడ్లు, ఆర్ టిసి కాంప్లెక్స్ విద్యార్థులు, తల్లిదండ్రులతో కలకలలాడింది. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని పలు పాఠశాలల నుంచి పెట్టె పేడ సర్దుకుని తమ ఊర్లకు పయనం అవుతూ కనిపించిన ఈ దశ్యాలు కనిపించాయి.

కుళాయి పనుల్లో గిరిజనులు

ప్రజాశక్తి -హుకుంపేట:పట్టం పంచాయతీ బూరు వలస గ్రామంలో దీర్ఘకాలికంగా నెలకొన్న తాగునీటి సమస్యపై గత సెప్టెంబర్ నెల 16న జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.తాగునీటి సౌకర్యం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామన్నారు. నూతనంగా కుళాయిలు మంజూరు కావడంతో గత వారం రోజుల పాటు గిరిజనులు బిజీగా ఉన్నారు. సమస్యను పరిష్కరించిన జిల్లా కలెక్టర్, ఏపీవో, గిరిజన సంఘం, సిపిఎం నేతలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు రాయితీపై పనిముట్లు

ప్రజాశక్తి- నక్కపల్లి:డాక్టర్ వైఎస్ఆర్ యంత్ర సేవ పథకం కింద రైతులకు 40 శాతం రాయితీపై పనిముట్లు అందజేసినట్లు వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. శనివారం వివిధ రైతు భరోసా కేంద్రాల వద్ద కస్టమ్ హైరింగ్ సెంటర్స్ ద్వారా ఆరు గ్రామాలలో ట్రాక్టర్, రోటోవేటర్స్, స్ప్రేయర్స్ సుమారు రూ.3.5 లక్షల సబ్సిడీతో రైతులకు యంత్ర పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ మాట్లాడుతూ, మండలంలో సుమారుగా 14575 మంది పిఎం కిసాన్ లబ్దిదారులు జాబితాలో వుండగా 1750 మంది రైతులు ఈకేవైసీ నమోదు చేయించుకోలేదన్నారు. లబ్ధి పొందాలంటే వెంటనే ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంక్ అధికారి డి ప్రసాద్, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కోటవురట్ల:ఎండపల్లి గ్రామంలో జగనన్న కాలనీ ఇళ్ల కోసం కేటాయించిన స్థలం సమీపంలో అనధికారిక లేఅవుట్ దారులు ఆక్రమించుకున్నారని గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ గొర్ల అప్పలనాయుడు శనివారం తహసిల్దార్ జానకమ్మకు ఫిర్యాదు చేశారు, స్పందించిన ఆమె తక్షణమే పరిశీలించాలని ఆర్ఐ ఉర్ధవరావుకు సూచించగా ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి ఆక్రమణకు గురైన స్థలం కొండపోడు భూమిగా గుర్తించడంతో పాటు ఆ స్థలం జగనన్న కాలనీకి కేటాయించిందన్నారు. సమగ్ర విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్యే గణేష్‌కు సన్మానం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం నుండి కృష్ణదేవిపేట అరిలోవ రోడ్డుకు అడ్డంకులు తొలగి పోయాయని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలియజేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురు చూస్తున్న ఈ రోడ్డుకు ఎట్టకేలకు అడ్డంకులు తొలగి పోయాయని, రూ.46 లక్షలు విడుదల అయ్యాయన్నారు. ఈ సందర్భంగా గొలుగొండ మండల నాయకులు ఎమ్మెల్యే ఇంటి వద్ద ఆయనను అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గిరిబాబు, పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, అధికార ప్రతినిధి జక్కు నాయుడు, సచివాలయ కన్వీనర్ కొరుప్రోలు పాణి శాంతారాం పాల్గొన్నారు.

గృహ నిర్మాణ శాఖలో అవినీతి

ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో వసూళ్లు
సర్వసభ్య సమావేశంలో నిలదీసిన సభ్యులు

ప్రజాశక్తి -నక్కపల్లి:జగనన్న కాలనీలో పేదలు గృహాలు నిర్మించుకుంటే లబ్ధిదారులకు పేమెంట్లు చెల్లించేందుకు గృహ నిర్మాణ శాఖలో లంచాలు డిమాండ్ చేస్తున్నారని న్యాయంపూడి ఎంపీటీసీ సభ్యులు ఆకేటి గోవిందరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, వేంపాడు ఎంపీటీసీ సభ్యులు కుంచె మధు ఆరోపించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులతో రివ్యూ నిర్వహించారు. హౌసింగ్ ఏఈ రాజు జగనన్న లేఅవుట్ లలో చేపడుతున్న గృహ నిర్మాణాలకు సంబంధించిన వివరాలను సభ్యులకు తెలియజేశారు. మండలంలో పలు గ్రామాల్లో లేఅవుట్ సమస్యల కారణంగా ఆయా గ్రామాల్లో గృహ నిర్మాణాలు ప్రారంభం కాలేదన్నారు. ఆవాస్ ప్లస్ కింద 254 గృహాలు మంజూరు అయినట్లు తెలిపారు. లబ్ధిదారులకు సకాలంలో పేమెంట్లు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. లబ్ధిదారులకు పేమెంట్ చెల్లించే విషయంలో లంచాలు ఎందుకు తీసుకుంటున్నారని ఏఈ రాజును ఎంపీటీసీ సభ్యులు గోవిందరావు నిలదీశారు. గ్రామాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో అవినీతి జరుగుతుందని ఆరోపించారు.

ఈ మేరకు ఏఈ రాజు మాట్లాడుతూ, నిర్మాణ శాఖలో ఎవ్వరూ లంచాలు తీసుకోలేదని స్పష్టం చేశారు. ఎవరైనా లంచం తీసుకున్నట్లు సమాచారం ఇస్తే చర్యలు చేపడతామన్నారు. సిహెచ్ లక్ష్మీపురం రెవిన్యూ పరిధిలో తిప్పలవాని చెరువు గట్టు మట్టిని రాత్రి సమయంలో ట్రాక్టర్లతో అక్రమంగా తరలించిపోతున్నారని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చినతీనార్ల ఎంపీటీసీ సభ్యులు వాసుపల్లి అప్పలస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి తరలింపు విషయంలో చినతీనార్ల సర్పంచ్ ముసలయ్య, ఎంపీటీసీ సభ్యులు అప్పలస్వామి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. మిగిలిన సభ్యులు శాంతింప చేశారు. తహశీల్దార్ నీరజ మాట్లాడుతూ, మట్టిని అక్రమంగా తరలించే అధికారం ఎవరికి లేదని, తరలిస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామన్నారు. బోదుగల్లం సర్పంచ్ మున్నిషా మాట్లాడుతూ, గ్రామంలో గ్రామకంఠం భూమిని ఆక్రమించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, జడ్పిటిసి సభ్యులు గోసల కాసులమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు .

రోడ్డు విస్తరణకు సహకరించాలి

ప్రజాశక్తి-కొత్తకోట:మేజర్ పంచాయతీ కొత్తకోటలో రోడ్డు విస్తరణకు గ్రామస్తులు సహకరించాలని రావికమతం తహసిల్దార్ మహేశ్వరరావు, ఆర్ అండ్‌బి శాఖ నర్సీపట్నం డివిజన్ జెఈ జయరాజ్ కోరారు.

కొత్తకోట పంచాయతీ కార్యాలయంలో శనివారం రెవెన్యూ, ఆర్ అండ్ బి శాఖ, పోలీస్, జలవనుల శాఖ అధికారులతో పాటు గ్రామ ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల విస్తరణతో అభివద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేసిందని అందులో భాగంగా చోడవరం నియోజకవర్గంలో రోలుగుంట మండలం యలం.కాయలపాలెం నుంచి బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్టు గ్రామం వరకు రోడ్డు విస్తరణ పనులు సాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కొత్తకోట గ్రామంలో ఆర్అండ్‌బి శాఖకు చెందిన స్థలాన్ని గుర్తించి విస్తరణ పనులు వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు గ్రామ మెయిన్ రోడ్‌లో గత కొన్నాళ్లుగా ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించి రోడ్డు విస్తరణకు సహకరించాలని వారు కోరారు. తొలి దశలో సమగ్ర సర్వే నిర్వహించి మార్కింగ్ చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు. అనంతరం ఆక్రమణదారులకు స్వచ్ఛందంగా తొలగించేందుకు వీలుగా తగు సమయం ఇస్తామన్నారు. ఆర్అండ్‌బి శాఖకు చెందిన స్థలాన్ని గుర్తించి ఇరువైపులా మురుగునీటి కాలువలు నిర్మించడమే కాకుండా గ్రామంలో సుమారు 1300 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. రోడ్డు విస్తరణతో గ్రామ స్వరూపం మారుతోందని తహసీల్దార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

బ్రిటీష్ కాలం నాటి సర్వే కావడంతో రెవిన్యూ ఎఫ్ఎంబి రికార్డు ప్రకారం సబ్ డివిజన్ మేరకు రోడ్డు విస్తరణను గుర్తిస్తున్నట్టు మండల సర్వేయర్ సత్యనారాయణ వివరించారు. ఆర్అండ్‌బి స్థలంలో దుకాణ సముదాయాలు లేక గృహ నిర్మాణ దారులను గుర్తించి వారికి తక్షణమే నోటీసులు జారీ చేయాలని పంచాయతీ ఈవో కృష్ణమోహన్‌ను ఆదేశించారు. శాంతి భద్రతల పరిరక్షణకు కొత్తకోట పోలీసులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విభూషణరావు, గ్రామ సర్పంచ్ కోనలోవరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్మడి సత్యదేవ్, ఉప సర్పంచ్ పందల దేవ, ఎంపిటిసిల ఫోరమ్ లీడర్ పూడి దేవ, మాజీ ఉప సర్పంచ్ గున్నాజీ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి పాల్గొన్నారు.

హౌసింగ్ లే-అవుట్ల పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ: మండల ప్రత్యేకాధికారి బి.మోహన్‌రావు హౌసింగ్‌డే కార్యక్రమంలో భాగంగా చోద్యం గ్రామపంచాయతీ లేఅవుట్లను సందర్శించారు. అనంతరం మండల సమీక్షలో భాగంగా మండల వివిధ శాఖల అధికారులతో సమావేశమై వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డేవిడ్‌రాజు, హౌసింగ్ ఎఈ గోపి, ఈఒపిఆర్‌డి రఘురామ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలో గొట్టివాడ గ్రామంలో శనివారం ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. కాలనీ నిర్మిస్తున్న ప్రాంతంలో విద్యుత్తు లైన్ ఆటంకంగా ఉందని ఈ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని లబ్ధిదారులు అధికారులు దష్టికి తీసుకువెళ్లారు. సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ హౌసింగ్ అధికారికి ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులకు అందుతున్న బిల్లులపై అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఇంజనీర్ జగదీశ్వరరావు, పిఆర్ ఇంజనీర్ వర్మ, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ కరుణ, ఏపీఎం రమణకుమారి పాల్గొన్నారు.

హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై శనివారం భీమిలి మండలం మజ్జిపేటలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్, సీడ్ మొబైల్ ఐసిటిసి ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మొబైల్ ఐసిటిసి కౌన్సెలర్ అర్జున్ మాట్లాడుతూ గర్భిణీలు విధిగా రక్త పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి సూరినాయుడు, ల్యాబ్ టెక్నీషియన్ కె.కిషోర్‌కుమార్, లింక్ వర్కర్ ఎం.జ్యోతి, వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానికంగా కేటాయించిన 3పరీక్షా కేంద్రాల్లో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. స్థానిక ఎపి బాలికల గురుకుల పాఠశాలలో 120 మందికి గానూ 102 మంది, సెయింట్ ఆన్స్ పాఠశాలలో 240 మందికి గానూ 212 మంది, చిట్టివలస జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 218 మందికి గానూ 198 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-సీతమ్మధార : మెలోడీ క్రియేటర్స్ ఆధ్వర్యాన శనివారం సాయంత్రం విశాఖ పౌర గ్రంథాలయంలో కళా తపస్వి కె.విశ్వనాథ్‌కు స్వరాభిషేకం పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించారు. ప్రముఖ సినీ నటుడు ఎస్‌కె.మిశ్రో, పౌర గ్రంథాలయ కార్యదర్శి ముఖ్య అతిథులుగా హాజరై సినీ నిర్మాత పీలా నీలతిలక్‌ను కళా తపస్వి బిరుదుతో సత్కరించారు. ఏ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరిలో కె.విశ్వనాథ్ దర్శకత్వం వహించిన సినిమాల్లోని గోవుళ్ళు తెల్లన్న పాటను సిహెచ్‌వి సత్యనారాయణ, నిషిత..., పారా హుషార్ పాటను ఎమ్మెస్ మాధవ్, ఎన్.రాజేశ్వరి.., శివ పూజకు పాటను కడలి, జ్యోతి.., రావమ్మా మహాలక్ష్మీ పాటను ప్రభాకర్, సాత్విక.., ఘల్లు ఘల్లు ఘల్లు పాటను కెవి.సురేష్, నీహారిక.., చుక్కలతో చెప్పాలని పాటను పుండరీ కుమార్, లక్ష్మీసాత్విక.., కొత్తగా రెక్కలొచ్చినా పాటను శ్రీనివాస్, సాత్విక ఆలపించారు. ఈ కార్యక్రమంలో విశాఖ సంగీత సంస్థల గౌరవాధ్యక్షులు కొణతాల రాజు, విశాఖ సిటీజన్ ఫోరం అధ్యక్షులు డాక్టర్ బిఎం.నాయుడు, కళా సంస్థల ప్రతినిధులు పెంటకోట వెంకటరావు, చెన్నా తిరుమలరావు, ఎంవీ రాజశేఖర్, సన్ మూర్తి, మాల్యాద్రి, ఉషా చీరాల, తిలక్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ముఠా కళాసీల ధర్నా

ప్రజాశక్తి- కంచరపాలెం : ముఠా కళాసీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని, మే డేను పోరాట దినంగా పాటించాలని కోరుతూ శనివారం జ్ఞానాపురం కూరగాయల మార్కెట్‌లో కళాసీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ, ముఠా కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయాలని, పెరిగిన ధరలకు అనుకూలంగా కూలి రేట్లు పెంచాలని, ముఠా కార్మికులకు పని భద్రత కల్పించాలని, 60 సంవత్సరాల దాటిన ముఠా కళాసీలకు నెలకు రూ.10 వేలు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కారక్రమంలో సిపిఐ నాయకులు రావికృష్ణ, ముఠా కళాసీ సంఘం మేస్త్రిలు పైలా కృష్ణ, ఆర్.నూకరాజు, కె.రాము, వై.సన్యాసిరావు, ఆర్.రాము, ఆర్.వెంకటరావు, ఎల్.రాము, డి.శ్రీనివాసరావు, వై.సన్యాసిరావు, ఆర్.చిన్న, కె.శ్రీను, పి.గంగాధరరావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన : బూడి

ప్రజాశక్తి-మాడుగుల: సమర్థవంతమైన పరిపాలన వైసిపి ప్రభుత్వం ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. శనివారం మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, మహిళలతో ముచ్చటించారు. గ్రామంలో 199 మందికి 3.58 కోట్ల రూపాయలతో ఇళ్ల పట్టాలు, నిర్మాణాలతో లబ్ది చేకూరిందన్నారు. ప్రతి ఇంటికి మంచి నీరు సరఫరా పథకం నిమిత్తం 70 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కోడూరు నుండి ఎస్టీ కాలనీ వరకు రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరిచే విధంగా పథకం ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జగనన్న మా భవిష్యత్ కార్యక్రమంలో 1.45 కోట్ల కుటుంబాలు పాల్గొన్నారని,1.1 కోట్ల మంది మిసిడ్ కాల్స్ ఇవ్వడం గర్వకారణమని అన్నారు.ప్రభుత్వానికి ప్రజలు సంపూర్ణ మద్దతు ఇచ్చారని, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, వైసిపి నేతలు పడాల అప్పలనాయుడు, పడాల అప్పలరాజు, చింత మూర్తి, కలిమి గొసమ్మ, కలిమి గోపాల్, లింగన్న తదితరులు పాల్గొన్నారు

మేడే ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని ప్రతి గ్రామంలో ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు తెలిపారు. మేడేను పురస్కరించుకొని గ్రామాల్లో ఉన్న స్థూపాలు, కర్రలకు రంగులు వేసి, వాడవాడలా ఎర్ర జెండాలు ఎగరేయడానికి సిపిఎం ఆధ్వర్యాన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ 8 గంటల పని గంటలు, కనీస వేతనాలు కోసం ప్రపంచ కార్మికులందరూ ఐక్యమై పోరాడి విజయం సాధించిన రోజే మేడు అని పేర్కొన్నారు. నేటి పాలకులు మేడే స్ఫూర్తికి విరుద్ధంగా హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. బూర్జువా పాలక వర్గాలు మొత్తం కార్పొరేట్ శక్తుల చేతుల్లో కీలు బొమ్మలుగా మారిపోయారని విమర్శించారు. అందుకే శ్రామికులందరూ ఏకమై హక్కులు, చట్టాలను తిరిగి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. మేడే వేడుకల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రంగులద్దుకుంటున్న స్తూపం

సిఎఫ్ఎ విస్తృత సేవలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఇన్వెస్టిమెంట్ ప్రొఫెషనల్ గ్లోబల్ అసోసియేషన్ సిఎఫ్ఎ ఇనిస్టిట్యూట్ టాలెంట్ పూల్ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్టు సంస్థ సిఇఒ మార్గరెట్ ఫ్రాంక్లిన్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎఫ్ఎ ప్రోగ్రామ్‌కి తాము చేసిన ముఖ్యమైన మార్పులు భవిష్యత్తు ఇన్వెస్టిమెంట్ ప్రొఫెషనల్‌కి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. యజమానులు, అభ్యర్థులు పరిశ్రమల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ పొందటానికి విస్తృతమైన పరిశోధనలు నిర్వహించినట్లు తెలిపారు. ఇన్వెస్టిమెంట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమ కోసం టాలెంట్ పూల్‌ను అభివృద్ధి చేయడానికి సిఎఫ్ఎ కట్టుబడి ఉందన్నారు.

పోస్టల్ సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అర్థం పర్థం లేని కారణాలతో రెండు పోస్టల్ ఉద్యోగ సంఘాల గుర్తింపును కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం అప్రజాస్వామికమని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం (ఎఐఐఇఎ) విశాఖపట్నం డివిజన్ అధ్యక్షులు ఎం.కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐపిఇయు), నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ (ఎన్ఎఫ్‌పిఇ) సంఘాలకు పోస్టల్ శాఖలో 70 శాతంపైన సభ్యుల బలం ఉందని, వాటి గుర్తింపును 5 శాతం బలం కూడా లేని ఓ సంఘం ఫిర్యాదుపై రద్దు చేయడం ఏమాత్రమూ సమర్థనీయం కాదని అన్నారు.

చెత్తను తరలించరూ..

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి 16, 23వ వార్డుల పరిధిలోగల మద్దిలపాలెం, కెఆర్‌ఎం.కాలనీ ప్రధాన కాలువల్లో తీసిన చెత్తను వెంటనే తరలించాలని సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు అధికారులను కోరారు. చెత్తను తరలించకుండా కుప్పలు కుప్పలు పోగుపెట్టడం వెల్ల దుర్వాసన వెదజల్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్నపాటి వర్షం వచ్చినా ఈ ప్రాంత కాలువలు నిండి రోడ్లపైకి చెత్త వచ్చి అధ్వానంగా మారుతున్నాయన్నారు. స్థానిక ప్రజలు సచివాలయ సిబ్బందికి, అధికారులకు విన్నవించుకోవడంతో వారం రోజుల కిందట ఈ ప్రాంతంలోని పెద్ద కాలువలో పూడికలు తీసి రోడ్డుపైనే వేశారన్నారు. రోజుల తరబడి అలాగే ఉంచడం వల్ల సమస్య ఉత్పన్నమవుతోందని తెలిపారు. పన్నులు వసూలుపై పెట్టిన శ్రద్ధ పారిశుధ్య నిర్వహణపై కొరవడిందని పేర్కొంటూ అధికారులపై మండిపడ్డారు.

కనీస వేతనాల బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రం కనీస వేతనాల బోర్డును ఏర్పాటు చేయాలని టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు గొట్టుముక్కల రఘురామరాజు అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడే సందర్భంగా సోమవారం గాజువాక లంకా మైదానంలో టిఎన్‌టియుసి ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. సభలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, పాశర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు..

3న రాస్తారోకోలను జయప్రదం చేయండి

విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి పిలుపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నుంచి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునేందుకు మే 3న జిల్లా వ్యాప్తంగా జరుగనున్న రాస్తారోకోలను ప్రజలు జయప్రదం చేయాలని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి సమావేశం పిలుపునిచ్చింది. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జెఎసి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ త్యాగాలతో ఏర్పడ్డ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. ప్లాంటుకు కేంద్రం కేవలం రూ.5 వేల కోట్లు పెట్టుబడి పెడితే తిరిగి కేంద్రానికి రూ. 50 వేల కోట్లు ఆదాయాన్ని స్టీల్‌ప్లాంట్ సమకూర్చిందని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలు, మహిళలు, వికలాంగులకు సామాజిక న్యాయం కల్పించిందన్నారు. కోవిడ్ కాలంలో లిక్విడ్ ఆక్సిజన్ సరఫరా చేసి వేలాది మంది ప్రాణాలను కాపాడిన విషయాన్ని గుర్తు చేశారు. అటువంటి విశాఖ మణిహారాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్ట్రాటజిక్ సేల్ పేరుతో వంద శాతం అమ్మకానికి పెట్టిందని తెలిపారు. ఈ ద్రోహానికి వ్యతిరేకంగా రెండేళ్లుగా ఉద్యమం జరుగుతున్నా.. మోడీ సర్కారు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్లాంటును చావు దెబ్బ తీసి తన అనుయాయులకు కట్టబెట్టే కుట్ర చేస్తోందన్నారు. కీలకమైన బ్లాస్ట్ ఫర్నేస్ 3ని మూసివేసిందని తెలిపారు. ముడిసరుకు, వర్కింగ్ క్యాపిటల్, సొంత గనులు ఇవ్వడం లేదని, రైల్వే రేక్స్‌కు కోత పెట్టిందని, ఇలా పలు ఆటంకాలు సృష్టించిందని విమర్శించారు. 8500 మంది నిర్వాసితులకు ఇంతవరకూ ఉద్యోగాలివ్వలేదన్నారు. తాజాగా ప్లాంటు ఉత్పత్తి ఆగకుండా నివారించేందుకని యాజమాన్యంతో ఇఒఐని ప్రతిపాదించి, బిడ్స్‌ను ఆహ్వానించిందని అన్నారు. వీటిలో ఎన్ఎండిసి, సెయిల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను పాల్గొనివ్వడం లేదని తెలిపారు. దేశ, విదేశీ ప్రయివేటు సంస్థలను అనుమతిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో మే 3న రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు చేయాలని రాష్ట్ర కార్మిక, ప్రజా సంఘాల జెఎసి పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖ ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున రాస్తారోకోల్లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జెఎసి నేతలు పడాల రమణ, భోగవిల్లి నాగభూషణం, కె.రామ్మూర్తి, వై.మస్తానప్ప, విళ్ళా రామమోహన్‌కుమార్, ఎన్.కనకారావు, కె.మల్లయ్య, ఎస్.జ్యోతీశ్వరరావు, కె.సంతోష్, యు.నాగరాజు, వై.సత్యవతి, కె.శంకరరావు, ఎల్‌జె.నాయుడు, జి.నాయినబాబు, ఎం.మన్మధరావు, ఎంఎస్.కృష్ణారావు, కె.లక్ష్మి, డి.అప్పారావు, కె.ఈశ్వరరావు, వై.రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జగ్గునాయుడు

758వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శనివారానికి 758వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు పెందుర్తి జోన్ నాయకులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ దొంగదారుల్లో మోడీ ప్రభుత్వం ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తోందన్నారు. దీక్షల్లో నాయకులు ఈశ్వరరావు, మురళి, భాస్కరరావు, పి.దుర్గారావు, జి.శంకర్, ఎండి.రాజు, గోవింద్, చిన్నారావు, ముఖేష్, బాబూరావు, వాసు, నాయుడు పాల్గొన్నారు.

టీచర్ ట్రైనింగ్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పిల్లల విద్యలో ఆన్‌లైన్ టీచర్ ట్రైనింగ్ కోర్సుల కోసం మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అడ్మిషన్ కో-ఆర్డినేటర్ గుడివాడ పద్మ రజని, ఫ్యాకల్టీ సుధా మీనన్ తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. టీచర్ ట్రైనింగ్ కోర్సుల కోసం ఎటువంటి వయోపరిమితీ లేదని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు నేషనల్ సెల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌లో పార్ట్ టైంగా పని చేస్తూ ఈ కోర్సులు చేసే అవకాశం ఉందని చెప్పారు. ఇతర వివరాలకు 7356666101, 09288026142 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. శనివారం జగనన్న గృహ నిర్మాణ పథకం, మౌలిక సదుపాయాల కల్పనపై కలెక్టర్ తన ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్, జివిఎంసి కమిషనర్, వియంఆర్‌డిఎ ఇంజినీరింగ్ సిబ్బంది, పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల గ్రౌండింగ్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. లక్ష్యాల ప్రకారం పనులు చేయాలని, కనీసం 50 శాతం ఇళ్లను మే 15వ తేదీలోపు బిఎల్ దశకు తీసుకురావాలని అన్నారు.

బాలల హక్కులను పరిరక్షిస్తాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సమన్వయంతో వ్యవహరించి విశాఖను బాలల హక్కుల పరిరక్షక నగరంగా తీర్చిదిద్దుదామని విశాఖ నగర పోలీసు కమిషనర్ త్రివిక్రమవర్మ అన్నారు. నగర నూతన పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన్ని శనివారం సూర్యాభాగ్‌లోని పోలీసు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ పోలీసు శాఖలో బాలల చట్టాలు, హక్కులపై సమగ్ర శిక్షణ తరగతులు ఏర్పాటుచేసి చైతన్యపరుస్తామన్నారు. పోలీసు కమిషనర్‌ను కలిసిన వారిలో లవకుశ తదితరులున్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిహెచ్‌సిలో అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని కోతులగుట్ట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో శనివారం కూనవరం అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది అగ్ని ప్రమాదాలు, అత్యవసర సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్యాధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆసుపత్రిలో గ్యాస్ లీకైతే వెంటనే ధైర్యంగా తీసుకునే జాగ్రత్తలు, ఫైర్ సిలిండర్లు ఉపయోగించే విధానం ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే విధంగా వివరించారు. ప్రమాదాలను నివారించేందుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కూనవరం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, ఎల్ఎఫ్ ఎం వెంకటరావు, డీఓపీ పి.రవి, ఫైర్‌మెన్‌లు డి.బాలాజీ, ఆర్.శ్రీను, వైద్యాధికారులు డాక్టర్ ఎం.వంశీ, డాక్టర్ రమ్య, హెడ్ నర్స్ బొజ్జి, వైద్య సిబ్బంది అనసూయ, రాజు, జోగారావు, వెంకన్న, ప్రసాద్, జీవన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి తదితరులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - అడ్డతీగల : అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి తెలిపారు. అడ్డతీగల మండలంలో, గొండోలు సచివాలయం పరిధి బొడ్లంక పంచాయతీలో బొడ్లంక, వెంకటనగరం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం ఎమ్మెల్యే నిర్వహించారు. గ్రామలలో ప్రతి ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఆయా పథకాల ద్వారా లబ్ధిదారులకు నగదు ఎంత వచ్చిందో కూడా తెలియజేశారు. రానున్న కాలంలో కూడా ఈ సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేస్తామని చెప్పారు. అర్హత ఉండి, సంక్షేమ పథకాలు అందని వారికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాల వల్లే తగ్గిన ఉత్తీర్ణత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రభుత్వ విధానాల వల్లే ఇంటర్‌లో ఉత్తీర్ణతా శాతం తగ్గుముఖం పట్టిందని ఎఐడిఎస్ఒ నగర అధ్యక్షులు కె.అభిలాష్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గడిచిన విద్యా సంవత్సరంలో ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను కూడా ప్రభుత్వం సరిగా అందించలేకపోయిందని తెలిపారు.